# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ మంగళవారం 25-7-2023 RNI No.52865/93·Postal No.HQ/SD/258/2021-2023 సంపుటి :29 సంచిక: 273 పేజీలు:6 వెల: రూ.1/-


## హైదరాబాద్‌లో భారీ వర్షం.. అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దన్న డీఆర్ఎఫ్



హైదరాబాద్, జులై 24: హైదరాబాద్ జంటనగరాల పరిధిలో భారీ వర్షం కురుస్తున్నది. ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురుస్తుండగా.. నగరాన్ని నల్లటి దట్టమైన మేఘాలు కమ్మేశాయి. నాచారం, మల్లాపూర్, ముషీరాబాద్, కొండాపూర్, మాదాపూర్, గచ్చిబౌలి, నారాయణగూడ, హిమాయత్‌నగర్, యూసుఫ్‌గూడ, కుత్బుల్లాపూర్, తిరుమలగిరి, అల్వాల్, బోయినపల్లి, జవహర్‌నగర్, బేగంపేట, బొల్లారం, మారేడ్‌పల్లి, చిలుకలగూడ, తార్నాక, ఓయూ, లాలాపేట, హబ్సీగూడలో భారీ వర్షం కురుస్తున్నది.

మెహదీపట్నం, ఆసిఫ్‌నగర్, చైతన్యపురి, గుడి మల్కాపూర్, నాంపల్లి, మలక్‌పేట, దిల్‌సుఖ్‌నగర్, ఖైరతాబాద్, పంజాగుట్టా, లక్డీకపూల్, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, రామంతాపూర్, బోడుప్పల్, పీర్జాదిగూడ, సుల్తాన్‌బజార్, బేగంబజార్, బషీర్‌బాగ్‌తో పాటు పలు ప్రాంతాల్లో భారీ వాన కురుస్తున్నది. కూకట్‌పల్లి, కాచిగూడ, విద్యానగర్, అంబర్‌పేట, ఉప్పల్, ఘట్కేసర్, రాజేంద్రనగర్, గండిపేట, కోఠి, అబిడ్స్‌తో పాటు పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురుస్తున్నది. భారీ వర్షంతో రోడ్లపై వాహనదారులు తీవ్రంగా ఇబ్బందుల పడుతున్నారు. మరో వైపు ట్రాఫిక్ తీవ్ర అంతరాయం కలుగుతున్నది.

మరో వైపు ట్రాఫిక్ తీవ్ర అంతరాయం కలుగుతున్నది. హైదరాబాద్ విజయవాడ రహదారిపై రాకపోకలు స్తంభించాయి. అబ్దుల్లాపూర్‌మెట్ నుంచి హైదరాబాద్ వైపు రాకపోకలు నిలిచాయి. వర్షంధాటికి దారి కనిపించకపోవడంతో వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి. భారీ వర్షంతో డీఆర్ఎఫ్ బృందాలు అప్రమత్తమ య్యాయి. ఈ సందర్భంగా టోల్‌ఫ్రీ నంబర్లు ఏర్పాటు చేసింది. అవసరముం టే 040-21111111, 900011 3667 నంబర్లలో సంప్రదించాలని డీఆర్‌ఎఫ్ సూచించింది. అత్యవసరమైతే తప్ప ప్రజలు ఇండ్ల నుంచి రావొద్దని కోరింది.

## జ్ఞానవాపి మసీదు సర్వే నిలిపివేస్తూ సుప్రీంకోర్టు ఆదేశాలు

వారణాసి జూలై 24 (ఎక్స్ ప్రెస్ న్యూ స్) : జ్ఞానవాపి మసీదు(లో పురావాస్తు శాఖ చేపడుతున్న సర్వేను రెండు రోజుల పాటు నిలిపివేస్తూ సుప్రీంకోర్టు ఇవాళ ఆదేశాలు జారీ చేసింది. కాశీ విశ్వనాథుడి ఆలయ ప్రాంగణంలో ఉన్న జ్ఞానవాపీ మసీదులో ఇవాళ ఉదయం ఏడు గంటలకు శాస్త్రీయ సర్వే ప్రారంభమైన విషయం తెలిసిందే. సర్వే పేరుతో మసీదులో తొవ్వకాలు జరిగే ప్రమాదం ఉందని జ్ఞానవాపీ మసీదు మేనేజ్మెంట్ అనుమానాలు వ్యక్తం చేసింది. దీంతో సర్వేకు కోర్టు బ్రేక్ వేసింది. అయితే సర్వే వల్ల మసీదుకు ఎటువంటి ప్రమాదం ఉండదని, మసీదులో ఉన్న ఒక్క ఇటుకను కూడా తీయలేదని, అలాంటి ఉద్దేశం కూడా లేదని కోర్టుకు కేంద్రం వెల్లడించింది. సర్వేలో భాగంగా మసీదును కొలతలు తీసుకోవడంతో పాటు ఫోటోగ్రఫీ, రేడార్ స్టడీ చేయనున్నట్లు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు తెలిపారు. మసీదులో సర్వే కోసం జిల్లా కోర్టు ఇచ్చిన ఆదేశాలపై స్టే విధిస్తున్నామని, అయితే ఈ కేసులో ముస్లిం కమిటీ అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు సీజే డీవై చంద్రచూడ్ తెలిపారు. జూలై 26వ తేదీ వరకు జిల్లా కోర్టు ఆదేశాలపై స్టే విధిస్తున్నట్లు సుప్రీం పేర్కొన్నది. ముస్లిం వర్గం సమర్పించే అఫిడవిట్‌ను హైకోర్టు ముందు ప్రవేశపెట్టాలని రిజిస్ట్రార్‌కు సుప్రీం ఆదేశాలు ఇచ్చింది. ముస్లిం గ్రూపు తరపు సీనియర్ న్యాయవాది హుజేఫా అహ్మది వాదించారు. ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా చాలా అత్యుత్సాహాన్ని ప్రదర్శిస్తోందని, ఇప్పటికే మసీదులోని పశ్చిమ గోడను తొవ్వడం ప్రారంభించినట్లు ఆయన కోర్టుకు తెలిపారు.

## ఇవిఎంల శిక్షణ అవగాహన కార్యక్రమాలను పకడ్బందీగా చేపట్టాలి : జిల్లా కలెక్టర్ వి.పి.గౌతమ్



ఖమ్మం, జులై 24: (నేటినిజం ప్రతినిధి): ఇవిఎంల శిక్షణ, అవగాహన కార్యక్రమాలను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ అన్నారు. సోమవారం ఐడిఓసి లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి రిటర్నింగ్ అధికారులు, తహసిల్దార్లతో ఇవిఎంల శిక్షణ, అవగాహన, ఫారం-6,7,8ల పరిష్కారం, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధత తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో నియోజకవర్గ కేంద్రాలలో ఇవిఎం లపై శిక్షణ, అవగాహన కేంద్రాలు ఏర్పాటుచేసినట్లు, అదేవిధంగా నియోజకవర్గానికి రెండు చొప్పున సంచార ప్రదర్శన రథాల ద్వారా అవగాహన చేపడుతున్నట్లు తెలిపారు. శిక్షణ, అవగాహన కొరకు వినియోగిస్తున్న ఇవిఎం లకు ఎన్నికల ఇవిఎం ప్రోటోకాల్ ఉంటుందని, భద్రత, రవాణా విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. అవగాహన కేంద్రాల వద్ద ఆర్మ్ గార్డ్, సంచార రథాలకు ఎస్కార్ట్ ఉండాలన్నారు. అవగాహనకు ఏర్పాటు చేసిన ఈ ఓటింగ్ యంత్రాలలో వివిప్యాట్ స్లిప్పులు బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు చేపట్టాలని ఆయన తెలిపారు. సంచార రథాలకు ఎల్ఇడి స్క్రీన్లు ఏర్పాటుచేసినట్లు, వీటి ద్వారా వీడియోల ప్రదర్శన చేసి, ఓటరుగా నమోదు, ఓటింగ్ ప్రక్రియ తదితర అన్ని విషయాలపై అవగాహన కల్పించాలన్నారు. ఓటరు జాబితాలో నమోదు ఉన్నది లేనిది చూడాలని, లేనిచో వెంటనే ఓటరుగా నమోదుకు చర్యలకై సూచించాలని ఆయన తెలిపారు. కొత్త ఓటరు నమోదు, షిఫ్టింగ్, మరణించిన వారి ఓట్ల తొలగింపు, మార్పులకు సంబంధించి వచ్చిన దరఖాస్తుల విచారణ వేగవంతం చేసి త్వరితగతిన పరిష్కారించాలని ఆయన అన్నారు. అన్ని విధాలుగా పరిశీలనలు చేసి, క్రొత్త పోలింగ్ కేంద్రాల ఆవశ్యకత, పోలింగ్ కేంద్రాల పేరు, ప్రదేశం మార్పులకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటుచేసి, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధత పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అభిలాష అభినవ్, శిక్షణ సహాయ కలెక్టర్ రాధిక గుప్తా, జిల్లా రెవిన్యూ అధికారిణి ఆర్. శిరీష, కలెక్టరేట్ ఏవో అరుణ, ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ రాంబాబు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగులుగా వీఆర్ఏలు.. ఉత్తర్వులు జారీచేసిన సీఎస్

హైదరాబాద్, జులై 24:తెలంగాణలో భూస్వామ్య వ్యవస్థకు చిహ్నంగా మిగిలిన వీఆర్ఏ వ్యవస్థను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసింది. ప్రస్తుతం వీఆర్ఏలుగా పనిచేస్తున్న అందరికీ ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించాలని నిర్ణయించింది. ఈ మేరకు సీఎం కేసీఆర్ ప్రకటించినట్టుగానే రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న 20,555 మంది వీఆర్ఏలను సూపర్ న్యూమరరీ పోస్టుల్లో క్రమబద్ధీకరించనున్నారు. సీఎం ఆదేశాల మేరకు సీఎస్ శాంతికుమారి సోమవారం వీఆర్ఏల క్రమబద్ధీకరణకు సంబంధించిన ఉత్తర్వులను విడుదల చేశారు. రాష్ట్రంలో వీఆర్ఏల క్రమబద్ధీకరణ, సర్దుబాటు, స్థిరీకరణ అంశాలపై ఆదివారం రాష్ట్ర సచివాలయంలో సీఎం కేసీఆర్ ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. నీరటి, మసూరు, లషర్ వంటి కాలం చెల్లిన పేర్లతో పిలుచుకుంటున్న, భూస్వామ్య వ్యవస్థకు చిహ్నాలుగా మిగిలిన వీఆర్ఏ వ్యవస్థను శాశ్వతంగా రద్దు చేస్తూ ఈ సమావేశంలో చారిత్రక నిర్ణయం తీసుకున్నారు. అందుకు సంబంధించిన ఉత్తర్వులను ఇవాళ విడుదల చేశారు. ఈ ఉత్తర్వుల కాపీని వీఆర్ఏల జేఏసీ నేతలకు అందజేశారు. దాంతో రాష్ట్రంలోని వీఆర్ఏలు అంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## నేటి కందం- నేటికి అందం

నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం

కం॥ విజయము మె తన జీవితమును
నిజ భాషగ జేసినట్టి నెపోలియనే
సజియించిన అబుకీర్ లో
గజగజలాడించి తుదకు గెలిచెను జయమున్!!



(25-7-1799 నెపోలియన్ అబుకీర్ యుద్ధంలో ముస్తాపాపాషాను ఓడించి విజయం సాధించాడు...)

-రాధశ్రీ
సెల్:9494481210

నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం

## అట్టహాసంగా ప్రారంభమైన 'తెలంగాణ ట్రై క్రీడా వేడుకలు



-ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి డాక్టర్ వి. శ్రీనివాస్ గౌడ్
-నెక్లెస్ రోడ్ నిండా నవతరం సైక్లింగ్ సంబరం, స్కేటర్ల ఉత్సాహం
-నీరా కేఫ్ వద్ద కేక్ కట్ చేసి, సైక్లింగ్ రేస్ ప్రారంభించి, సైకిల్ రేస్‌లో పాల్గొని జోష్ నింపిన
-వేలాదిగా పాల్గొన్న యువత, కేసీఆర్ లాంగ్ లీవ్ నినాదాలతో మారుమోగిన నెక్లెస్ రోడ్

హైదరాబాద్ జూలై 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );రాష్ట్ర ఐటీ పరిశ్రమలు, మున్సిపల్ శాఖ మంత్రివర్యులు కె. తారక రామారావు గారి జన్మదినం సందర్భంగా ఈరోజు తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ ట్రై క్రీడా వేడుకలు నెక్లెస్ రోడ్ వద్ద ఘనంగా ప్రారంభమైనాయి. తదుపరి ఇందిరా పార్కులో రోలర్ స్కేటింగ్ పోటీలను మంత్రి శ్రీనివాస్ గౌడ్, ఛై?ర్మన్ డాక్టర్ ఆంజనేయ గౌడ్ ప్రారంభించి స్కేటర్లను ఉత్సాహపరిచారు. మధ్యాహ్నం యూసుఫ్‌గూడా, కెవిబిఆర్ ఇండోర్ స్టేడియంలో మహిళల రెజ్లింగ్ పోటీలు ఛైర్మన్ డాక్టర్ ఆంజనేయ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి డాక్టర్ వి. శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, గౌరవ కేసీఆర్ గారి అడుగుజాడల్లో నడుస్తూ రాష్ట్ర అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్న యూత్ ఐకాన్ కేటీఆర్ గారి జన్మదినం సందర్భంగా క్రీడా పోటీలు నిర్వహించుకోవడం సంతోషకరమని అన్నారు. గత దశాబ్ది కాలం నుండి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు ఎంతో ప్రాముఖ్యత కల్పించిందని క్రీడారంగ రిజర్వేషన్లు, నియోజకవర్గాల్లో స్టేడియాల నిర్మాణం, అంతర్జాతీయ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు ఇళ్ల స్థలాల కేటాయింపు, నగదు ప్రోత్సాహకాలు వంటి నిర్ణయాలతో దేశానికి తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా నిలిచిందని, క్రీడా శాఖ అభివృద్ధిలో మంత్రి కేటీఆర్ గారి ప్రోత్సాహం, సహకారం ఎంతో ఉందని ఆయన తెలిపారు. ఇటీవల విజయవంతంగా నిర్వహించిన సీఎం కప్ ' 2023' స్ఫూర్తిని మరింత ముందుకు తీసుకుపోవడానికి ఈ క్రీడా పోటీలు ఎంతగానో దోహదం చేస్తాయని అన్నారు. ఛైర్మన్ డాక్టర్ ఆంజనేయ గౌడ్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో సైక్లింగ్ స్కేటింగ్, రెజ్లింగ్ అంశాలలో నిర్వహిస్తున్న ఈ పోటీలకు క్రీడాకారుల నుండి భారీ ఎత్తున స్పందన లభించిందని, యువ క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారని వివరించారు. మానవ సమగ్ర అభివృద్ధి క్రీడా ద్వారానే సాధ్యమవుతుందన్న సందేశాన్ని ఈ క్రీడా పోటీల ద్వారా విస్తృతంగా ప్రచారం చేస్తున్నామని తెలిపారు. ఈ క్రీడా పోటీల విజయవంతానికి ముందుకు వచ్చిన తెలంగాణ సైక్లింగ్ అసోసియేషన్, తెలంగాణ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్, తెలంగాణ ఆమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ ప్రతినిధులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఐటి పారిశ్రామిక అభివృద్ధిలో క్రియాశీలక పాత్ర వహిస్తూ ప్రపంచ ప్రఖ్యాత కంపెనీలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టడంలో కెటిఆర్ గారి కృషి ఎనలేనిదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పోరేషన్ ఛైర్మన్లు పల్లె రవికుమార్, గెల్లు శ్రీనివాస్ యాదవ్, దూదిమెట్ల బాలరాజు యాదవ్, బిసి కమిషన్ సభ్యుడు కిషోర్ గౌడ్, గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ గడ్డం శ్రీనివాస్ యాదవ్‌లు అతిథులుగా హాజరైనారు. తెలంగాణ సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు మల్లారెడ్డి, దత్తాత్రేయ వెటర్న్ సైక్లిస్ట్ మర్రి లక్ష్మారెడ్డి, తెలంగాణ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ ప్రతినిధులు సి హెచ్ నరేష్, నిర్మల్‌సింగ్, రెజ్లింగ్ అసోసియేషన్ ప్రతినిధులు నర్సింగ్‌రావు, డిప్యూటీ డైరెక్టర్ చంద్రారెడ్డి, ఒలంపిక్ అసోసియేషన్ ప్రతినిధులు ప్రేమ్‌రాజ్, ప్రభుత్వ ఫిజికల్ కళాశాల ప్రిన్సిపల్ రామిరెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ కోచ్‌లు రవీందర్, గోకుల్, జితేందర్, జైపాల్, విజయభాస్కర్, సుధాకర్, శ్రీకాంత్, క్రీడా అధికారులు, క్రీడాభిమానులు, క్రీడా సంఘాల ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## మణిపూర్‌లో హింసాకాండపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధం: హోం మంత్రి అమిత్‌షా



న్యూఢిల్లీ జూలై 24 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: మణిపూర్ అంశంపై పార్లమెంటు సభాకార్యక్రమాలు మూడవ పనిదినమైన సోమవారంనాడు కూడా ఎలాంటి సభాకార్యక్రమాలు లేకుండా వాయిదా పడింది. ఇటు అధికార పక్షం, అటు విపక్షం పట్టువిడుపులు లేని ధోరణి ప్రదర్శిస్తుండటంతో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా లోక్‌సభలో కీలక ప్రకటన చేశారు. మణిపూర్‌లో కొనసాగుతున్న హింసాకాండపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించారు. చర్చ సజావుగా జరిగేలా సహకరించాలని ప్రతిపక్షాలకు విజ్ఞప్తి చేశారు. ''మణిపూర్ అంశంపై చర్చించేందుకు నేను సిద్ధంగా ఉన్నాను. విపక్షాలు చర్చకు ఎందుకు సుముఖంగా లేరో అర్థం కావడం లేదు. ముందు సభలో చర్చను జరగనీయండి. అత్యంత సున్నితమైన ఈ అంశంలో వాస్తవం ఏమిటనేది దేశ ప్రజలు తెలుసుకోవాల్సిన అవసరం ఉంది" అని అమిత్‌షా అన్నారు. మణిపూర్‌లో హింసాకాండపై పార్లమెంటులో ప్రతిష్ఠంభనపై లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కలుసుకున్న అనంతరం అమిత్‌షా ఈ ప్రకటన చేయడం విశేషం. దీనికి ముందు, మణిపూర్ ఉదంతంపై ఉభయ సభలు అట్టుడికాయి. పూర్తిస్థాయి చర్చ జరగాల్సిందేనని, సభలో మోదీ సమాధానం చెప్పాలని కాంగ్రెస్, ఆర్జేడీ, ఎంఐఎం, వామపక్షాలు, బీఆర్ఎస్ తదితర ప్రతిపక్షాలు గళమెత్తాయి. ప్రధాని సమక్షంలోనే చర్చ జరగాలని డిమాండ్ చేశాయి. మణిపూర్‌పై చర్చించాలని వాయిదా తీర్మానాలు ప్రవేశపెట్టాయి. సభ్యులు ఇచ్చిన నోటీసులపై స్వల్పకాలిక చర్చకు అటు లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ ఛైర్మన్ అంగీకరించారు. అయితే రాజ్యసభ రూల్ 267 కింద సభా కార్యకలాపాలన్నీ నిలిపివేసి మణిపూర్‌పై చర్చ జరపాలని ఖర్గే పట్టుబట్టారు. దీనికి అనుమతించకపోవడంతో వాయిదాల పర్వం కొనసాగుతోంది. సోమవారం పార్లమెంట్ ఆవరణలో కూడా అధికార, విపక్ష పార్టీల ప్లకార్డులతో పోటాపోటీగా ఆందోళనలకు దిగాయి. పార్లమెంట్ గాంధీ విగ్రహం ఎదుట బీజేపీ ఎంపీలు ఆందోళన చేశారు. బెంగాల్ హింస, రాజస్థాన్‌లో మహిళలపై నేరాలపై నిరసన వ్యక్తం చేశారు. ఈ అంశాలపై పార్లమెంట్‌లో చర్చ జరపాలని డిమాండ్ చేశారు. కాగా, ప్రధాని సభకు వచ్చి మణిపూర్ అంశంపై మాట్లాడితే ఇబ్బంది ఏమిటని కాంగ్రెస్ ప్రశ్నించింది. ఆయన సభకు వస్తే ఆకాశం విరిగి మీదపడిపోదంటూ వ్యాఖ్యానించింది. మరోవైపు, మణిపూర్ అంశంపై చర్చకు డిమాండ్ చేస్తూ అనుచితంగా వ్యవహరించారంటూ 'ఆప్' ఎంపీ సంజయ్ శర్మపై సోమవారంసస్పెన్షన్ వేటు పడింది. పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ముగిసేంత వరకూ ఆయనను సస్పెండ్ చేస్తున్నట్టు రాజ్యసభ ఛైర్మన్ జగ్దీప్ ధన్‌కడ్ ప్రకటించారు.

## ఇండోనేషియాలో ఘోర పడవ ప్రమాదం -15 మంది మృతి

ఇండోనేషియా జూలై 24 :ఇండోనేషియాలో ఘోర పడవ ప్రమాదం చోటు చేసుకుంది. సులవేసి ద్వీపం లోని సముద్రంలో పడవ మునిగి 15 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 19 మంది గల్లంతయ్యారు. ఆగ్నేయ సువలేసి ప్రావిన్స్ రాజధాని కేందారీకి దక్షిణంగా 200 కిలోమీటర్ల దూరంలో ఉన్న మునా ద్వీపం లోని ఒక బే గుండా ఈ నౌక ప్రయాణికుల్ని తీసుకెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ప్రమాద సమయంలో పడవలో 40 మంది ప్రయాణికులు ఉన్నట్లు తెలుస్తోంది. అందులో ఆరుగురు ప్రాణాలతో బటయడినట్లు ఏజెన్సీ ఓ ప్రకటనలో తెలిపింది. అర్ధరాత్రి సమయంలో ప్రమాదం సంభవించినట్లు పేర్కొంది. అయితే, ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. ప్రమాదం నుంచి బయటపడిన వారు స్థానిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు అధికారులు తెలిపారు.

## ఈ నెల 30న పీఎస్ఎల్‌వీ సీ56 ప్రయోగం



శ్రీహరికోట జూలై 24 (ఎక్స్ ప్రెస్ న్యూ స్): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మరో ప్రయోగానికి సిద్ధమవుతున్నది. ఈ నెల 30న పీఎస్ఎల్‌వీ సీ56 ప్రయోగం చేపట్టనుంది. ఏపీలోని శ్రీహరికోటలో ఉన్న సతీశ్‌ధవన్ అంతరిక్ష ప్రయోగ కేంద్రం నుంచి 30న ఉదయం 6.30 గంటలకు సింగపూర్‌కి చెందిన డీఎస్-ఎస్ఏఆర్ ఉపగ్రహంతోపాటు మరో ఆరు శాటిలైట్లను నింగిలోకి పంపనున్నట్టు ఇస్రో సోమవారం వెల్లడించింది. సింగపూర్ ప్రభుత్వ ఏజెన్సీలకు ఉపగ్రహ ఛాయాచిత్రాల అవసరాల నిమిత్తం డీఎస్-ఎస్ఏఆర్‌ను ప్రయోగిస్తున్నారు. డీఎస్ ఎస్ఏఆర్‌తోపాటు టెక్నాలజీ డెమాన్‌స్ట్రేషన్ మైక్రో శాటిలైట్ వెలాక్స్-ఏఎం, ఎక్స్‌పరిమెంటల్ శాటిలైట్ 'ఆర్కేడ్', 3యూ నానోశాటిలైట్ 'స్కూబ్-2', ఐవోటీ కనెక్టివిటీ నానోశాటిలైట్ 'నూలయన్', గలాసియా-2, ఓఆర్‌బీ-12 స్ట్రైడర్ శాటిలైట్లను కూడా రోదసిలోకి పంపనున్నారు. చంద్రుడిపై పరిశోధనల కోసం ఇస్రో ఇటీవలే చంద్రయాన్-3ని విజయవంతంగా ప్రయోగించిన విషయం తెలిసిందే.

## మన చెత్త-మన బాధ్యత.. మురికి కాలువలో పేపర్లు, కవర్లను తొలగించిన మంత్రి హరీశ్ రావు



సిద్దిపేట, జులై 24: వ్యక్తిగత శుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని మంత్రి హరీశ్ రావు అన్నారు. చెత్తవల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. నడకతో ఆరోగ్యం, చెత్త ఏరివేతతో స్వచ్ఛ పట్టణం కార్యక్రమానికి మంత్రి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా సిద్దిపేటలో మన చెత్త-మన బాధ్యత అంటూ ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని 18వ వార్డులో నడుస్తూ మురికి కాలువలో పేరుకుపోయిన పేపర్లు, కవర్లను స్వయంగా తొలగించారు. చెత్త పేరుకుపోవడంతో అపరిశుభ్రమైన వాతావరణం ఉంటుందని చెప్పారు. ఇంటిని, ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో నిన్న నిర్వహించిన ఆదివారం ఉదయం 10 గంటలకు 10 నిమిషాలు.. దోమల నివారణ కార్యక్రమంలో భాగంగా కోకాపేటలోని తన నివాసంలో పరిసరాలను శుభ్రం చేసిన విషయం తెలిసిందే.

ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యవంతమైన కుటుంబం, సమాజం సాధ్యమవుతుందని మంత్రి హరీశ్ రావు అన్నారు. వర్షాకాలంలో అంటు వ్యాధులు వ్యాపించే అవకాశం ఉంటుందని చెప్పారు. ముఖ్యంగా ఇంటి పరిసరాలు శుభ్రంగా లేకున్నా, నీటి నిల్వ ఉండటంతో దోమలు ఎక్కువగా వ్యాపించే అవకాశం ఉంటుందని చెప్పారు. వాటి ద్వారా వచ్చే డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులకు దూరంగా ఉండాలంటే దోమల నివారణకు అందరూ కృషి చేయాలని సూచించారు.

పూల కుండీలు, కొబ్బరి చిప్పల్లో నిల్వఉండే నీళ్లలో దోమల లార్వా ఎక్కువగా ఉంటుంది. కాబట్టి ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకుంటే ప్రతీ కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందని మంత్రి తెలిపారు. ఆరోగ్యం విషయంలో నివారణ కంటే జాగ్రత్త ఉత్తమం అనే విషయాన్ని అందరూ గుర్తుంచుకోవాలన్నారు. వ్యాధులు రాకుండా ముందుగా జాగ్రత్త పాటించడం వల్లనే ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందని చెప్పారు. మరీ ముఖ్యంగా చిన్న పిల్లలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

## సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా



సంగారెడ్డి, జూలై 24 (నేటినిజం ప్రతినిధి): భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి పిలుపుమేరకు బిజెపి సంగారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన "అర్హులందరికీ డబల్ బెడ్ రూమ్ ఇల్లు" కేటాయించాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదురుగా ధర్నా కార్యక్రమంలో పాల్గొన్న బిజెపి సంగారెడ్డి అసెంబ్లీ ఇంచార్జ్ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజేశ్వర్ రావు, దేశ్ పాండే, నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే విజయ్ పాల్ రెడ్డి, రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, మండల నాయకులు, బూత్ అధ్యక్షులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మరణించే కళను సహితం నేర్చుకుందాం?..!

మనిషి నిరంతరం అభద్రత, భయం గుప్పిట్లో గడుపుతుంటాడు. మరణ మేఘాలు మన వెంటనే నీడలా వస్తుంటాయి. మరణానికి సంజీవని లాంటి ఔషధం లేదు. మరణమనేదే అసలైన సత్యం. ప్రతి వ్యక్తి మరణిస్తాడని తెలిసినా మరణం గూర్చి ఆలోచించడానికి ఇష్టపడడం లేదు. పాప జననానికి ప్రణాళికలు వేస్తాం, వేయి కళ్లతో పిల్లల కోసం ఎదురు చూస్తాం. మరణం అనివార్యమని తెలిసినా ససేమిరా ఆలోచించడానికి ఇష్టపడడు మానవుడు. ఎవరికీ తప్పని మరణాన్ని జీర్ణించుకోవడం, మరణం గూర్చి అవగాహన చేసుకోవడం నిరంతరం జరగాలి. అనుకోకుండా మరణం ఆలింగనం చేసుకుంటుందని తెలిసినా దాని గూర్చి ఆలోచించడానికి, ఆ పదం ఉచ్చరించటానికి కూడా అతి తెలివి నరుడు ఇష్టపడడు. మనం చేసుకున్న కుటుంబ/వ్యక్తిగత అభివృద్ధి ప్రణాళికలు, ఆరోగ్య ఆనందాలను త్యాగం చేసి పోగుచేసిన ఆస్తులు, మన చుట్టు ఉన్న సమాజం, ఆప్తులు మరణంతో దూరం అవుతారు. జీవితమనే పెద్ద కథను మరణం అనే సత్యం పొట్టిగా ముగింపునిస్తుంది. స్పర్శ, వినికిడి, కదలికలు, రుచి, వాసన, వాక్కు, చూపు లాంటి పంచేంద్రియాలను మరణం మింగేస్తుంది. అప్పుడు మరణం ఒక విషాదకర సంఘటన అని అందరం భావిస్తాం.

### పుట్టుక శుభం, చావు అశుభం అవుతుందా..!

పుట్టుక శుభం అయినప్పుడు చావు అశుభమైన అనుకోని ఆశ్చర్య ఘటన ఎలా అవుతుంది. ఒక జీవి మరణం మరో జీవి నవ్య జననానికి నాంది అవుతుంది. అందమైన సుగంధ పుష్పం వాడిపోయి రాలిపోతూ మరో మొగ్గ తొడగడానికి ఆహ్వానం పలుకుతుంది. ఒక మొక్క ప్రాణ త్యాగమే మరో మొక్క అంకురించడానికి నాంది అవుతుంది. మరణమనేదే లేనపుడు జీవుల ఉనికి ఉండదు కదా. మరణమే మరో జీవి జననానికి పునాదని, మరణం మనిషికి భయాన్ని కలిగించకూడదని అర్థం చేసుకొని ధైర్యంగా తుది వరకు ఆత్మవిశ్వాసంతో జీవించడం నేర్చుకుందాం. మరణం మరో జీవిత చక్ర గమనానికి పలికే ఆహ్వానం అనుకున్నపుడు మరణాన్ని అంగీకరించి ముందుకు సాగడం ఉత్తమం. మనం కొనే ప్రతి వస్తువుకు సంబంధించిన గడువు తేదీ (ఎక్స్‌పైరీ డేట్) చూస్తుంటాం, గడువు తేదీ దాటితే దానిని చెత్తబుట్టలో పడేస్తాం, విషతుల్యమని భావిస్తాం. అలాగే ప్రతి జీవికి ఎక్స్‌పైరీ డేట్ ముద్రితం అవుతుందని, అది మనకు తెలియదని గమనించాలి. మరణం మన ప్రోగ్రామ్ అంతానికి రెడ్ బటన్ నొక్కుతూ, మరో సిస్టమ్ (రీబూట్) ప్రారంభమవుతుంది. అపరిమిత కోరికలు, సంపాదనపై మోజు, వందల ఏండ్లు ప్రణాళికలు వేయడం, అర్హతకు మించి ఆశించడం లాంటివి మరణ భయానికి, దుఃఖానికి కారణాలుగా గుర్తించాలి.

### సంపాదనలో సంతోషం వెతుక్కోవడం..!

సంపాదనలో ఆనందం వెతుక్కోవడం, భవంతుల్లో సంతోషాలను చూసుకోవడం మనకు అలవాటైపోయింది. ప్రపంచాన్ని జయించడమే తనకు ఆనందమని అనుకున్న అలెక్జాండర్ ది గ్రేట్ కూడా ఒట్టి చేతులతోనే మట్టిలో కలిశాడు. జీవితాంతం కష్టపడి ఆర్జించిన మన సంపాదన, కార్లు, ధనం, ఖ్యాతి, భవంతులు, బ్యాంక్ బ్యాలెన్సులు, విలువైన నగలు, స్థిరచరాస్తులను మరణం మన నుంచి లాక్కుపోతుంది. నేడు చేయాల్సిన పనిని రేపటి వాయిదా వేయడం మంచిది కాదు. జీవితంలోని ప్రతి క్షణాన్ని ఆస్వాదిస్తూ గడపాలి. మరణ అంచు వరకు ఆనందాన్ని వెతుక్కోవాలి. మరణం గూర్చి జాగృతం కావడమే పరమానంద జీవన మార్గం.

### నేటి సత్కార్యాలను రేపటికి వాయిదా వేయవద్దు:

ఏ క్షణమైనా మరణించవచ్చనే భావనతో సత్కార్యాల్ని, దాతృత్వ పనుల్ని వెంట వెంటనే చేయాలి. మనకు మరణమే లేదనే విధంగా జ్ఞానాన్ని సంపాదించే ప్రయత్నం చేయాలి. చావు అనేది మన రేపును తీసుకు వెళుతుంది. అందుకే నేటి సత్కార్యాలను రేపటికి పొడిగించవద్దు. జననం వలె మరణం కూడా సహజం. మానవత్వాన్ని మరిచిన బతుకులు మరణంతో సమానం. "మరణించే కళ (ఆర్ట్ ఆఫ్ డైయింగ్)' గూర్చి ప్రపంచ ప్రఖ్యాత మార్షియల్ ఆర్టిస్ట్, సినీ నటుడు బ్రూస్ లీ విలువైన సందేశం ఇచ్చారు. గెలుపోటముల గూర్చి, సంతోష బాధల గూర్చి కాకుండా పోరాట స్ఫూర్తితో విధుల నిర్వహణ చేయడం ప్రధానమని గమనించాలి. జయాపజయాలు శాశ్వతం కాదని, జీవితాన్ని అర్థవంతంగా గడపడం ముఖ్యమని తెలుసుకోవాలి.

### మనిషికి పట్టిన ఆరు అసలైన రుగ్మతలు:

గెలవాలనే అతి నమ్మకం, జిత్తులమారి ఎత్తుగడలు వేయడం, నేర్చుకున్న దానిని పూర్తిగా ప్రదర్శించాలని అనుకోవడం, శత్రువును అకారణంగా భయకంపితుల్ని చేయడం, నిష్క్రియాత్మకంగా ఉండడం, ప్రతికూల ప్రభావ ఫలితమిచ్చే ప్రతి ఒక్క దానికి దూరంగా ఉండాలని కోరుకోవడమనే 6 అంశాలు మనిషికి పట్టిన అసలైన రోగాలు లేదా రుగ్మతలని తెలుసుకోవాలి. నేర్చుకున్న నైపుణ్యాలు, కళలన్నీ మనకు విజయం చేకూర్చుతాయని దురాశ పడడం అర్థరహితమని తెలుసుకోవాలి. గతాన్ని మరిచి పోవడం, వర్తమాన గమన ఇంధనంగా గత అనుభవాలను మలుచుకోవడం మాత్రమే మన చేతుల్లో ఉందని అర్థం చేసుకోవడం ఉత్తమం.

జీవించడం వెంటే మరణించడం ఉంటుందని, ఈ క్షణమే మన జీవితమని తెలుసుకోవాలి. గొప్పగా మొదలు పెట్టడం కాదు, మొదలు పెట్టిన దానిని గొప్పగా ముగించడం ముఖ్యమని గమనించాలి.



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# దండం పెడతాం..దయచూపండి

**-మూడో విడత అక్రెడిటేషన్ కార్డులు మంజూరు చేయండి**
**- సీఎం ఇచ్చిన ఇళ్లస్థలాల హామీని వేగవంతం చేయండి**
**- టీయుడబ్ల్యూజే(టీజేఎఫ్)ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి**

ఖమ్మం, జులై 24: (నేటినిజం ప్రతినిధి): తక్షణమే అక్రెడిటేషన్ కమిటీని సమావేశపరిచి జిల్లాలో మూడో విడత అక్రెడిటేషన్ కార్డులను నేతృత్వంలో సోమవారం గ్రీవెన్స్ లో కలెక్టర్ వి.పి. గౌతమ్ ను కలిశారు. ఈ సందర్భంగా ఆదినారాయణ మాట్లాడుతూ...జిల్లాలో గడిచిన



మంజూరు చేయాలని కోరుతూ టీయుడబ్ల్యూజే (టీజేఎఫ్)ఆధ్వర్యంలో కలెక్టర్ కు వినతి పత్రం సమర్పించారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఆకుతోట ఆదినారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి చిర్రా రవి కొన్నేళ్లుగా వివిధ పత్రికలు, ఛానల్స్ లో పని చేస్తున్న జర్నలిస్టులకు పూర్తి స్థాయిలో అక్రెడిటేషన్లు అందలేదని వివరించారు. ఇప్పటికి రెండు విడతలుగా అక్రెడిటేషన్ కమిటిని సమావేశ పరిచి కార్డులు మంజూరు చేశారని గుర్తు చేశారు. మూడో విడత అక్రెడిటేషన్ కమిటీని తక్షణమే సమావేశపరిచి అక్రెడిటేషన్ అందాల్సిన అర్హులైన విలేకరులందరికీ కార్డులు పంపిణీ చేయాలని విజ్ఞప్తి చేశారు. అక్రెడిటేషన్ రాని జర్నలిస్టులందరూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన వారేనని, వారి దాయనీయతను దృష్టిలో ఉంచుకుని మూడో విడత అక్రెడిటేషన్ కార్డులను వెంటనే మంజూరు చేయాలని కలెక్టర్ ఎదుట చేతులు జోడించి వేడుకున్నారు. అలాగే జనవరి నెల 18వ తేదీన ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన ఇళ్ల స్థలాలు పంపిణీ హామీ ఇంతవరకు నెరవేరలేదని చెప్పారు. ఆర్నెల్లు గడిచిపోయినా జిల్లాలోని అర్హులైన జర్నలిస్టులకు నేటి వరకూ ఇళ్ల స్థలాలు అందలేదన్నారు. ఈ అంశంపై ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకుని ఇళ్ల స్థలాల పంపిణీ ప్రక్రియను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో టెంజు జిల్లా ప్రధాన కార్యదర్శి రజనీకాంత్, సహాయ కార్యదర్శి ఎస్.కె. జానీపాషా, ఖమ్మం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు గుద్దేటి రమేష్, జిల్లా ఉపాధ్యక్షుడు వనం నాగయ్య, జిల్లా నాయకులు కాపర్తి నరేంద్ర, అమరవరపు కోటేశ్వరరావు, బండి కుమార్, మోహన్, రాజేంద్రప్రసాద్, అశోక్, సతీష్, కంచర్ల నవీన్ బాబు, ముత్యాల కోటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

# ఎక్కడ పడితే అక్కడ, ఏది పడితే అది మాట్లాడొద్దు..

**-మీడియాకు దూరంగా ఉండాలని 'బండి'కి జవదేకర్ హెచ్చరిక..!**

హైదరాబాద్, జూలై 24(ఎక్స్ ప్రెస్ న్యూ స్); 'ఢిల్లీకి పోయి ఫిర్యాదులు చేయడం ఆపండి.. కిషన్ రెడ్డినైనా ప్రశాంతంగా పని చేసుకోనీయండి' అంటూ బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలపై బీజేపీ పెద్దలు సీరియస్ అయ్యారట. దీంతో ఆ పార్టీ అధిష్ఠానం ఆదేశం మేరకు కేంద్ర మాజీ మంత్రి, రాష్ట్ర ఎన్నికల ఇన్‌చార్జి ప్రకాశ్ జవదేకర్ తాజాగా బండిని పిలిపించుకుని క్లాస్ పీకినట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. పార్టీకి రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేసిన వ్యక్తి ఇలా బహిరంగ వేదికపై నోరు జారడం ఏమిటని ప్రశ్నించినట్టు సమాచారం. రాష్ట్ర పార్టీకి సంబంధించిన అగ్రనేతలందరూ ఉన్న వేదికపై అలా మాట్లాడటం హద్దు మీరినట్టేనని బండికి స్పష్టం చేశారట. బీజేపీలో ఎంతో క్రమశిక్షణ కలిగిన నేతనని చెప్పుకుంటూ ఇలా మాట్లాడటం వెనుక అంతర్యం ఏమిటని నిలదీశారట. పదవిలో ఎవరు ఉండాలో, ఎవరు ఉండొద్దో నిర్ణయించేది అధిష్ఠానమైతే రాష్ట్ర నేతలకు ఎందుకు ముడి పెడుతున్నావని బండిని ప్రశ్నించినట్టు సమాచారం. దీనిపై బండి అసహనం వ్యక్తం చేసినట్టు తెలిసింది. రాష్ట్ర బీజేపీ అధ్యక్ష పదవి నుంచి తనను ఏ కారణంగా తప్పించారో అధిష్ఠానం ఎందుకు చెప్పడం లేదని ఆయన అడిగినట్టు సమాచారం. పార్టీకి చేసిన సేవలకు కనీసం జాతీయ స్థాయిలో మంచి పదవి వస్తుందని ఆశిస్తే.. తూతూ మంత్రంగా ఓ పదవి ముఖాన పడేశారంటూ ఆయన ఆవేదన వ్యక్తం చేసినట్టు తెలుస్తున్నది. దీంతో కొన్నాళ్ల పాటు మీడియాకు దూరంగా ఉండాలని, ఎక్కడ పడితే అక్కడ, ఏది పడితే అది మాట్లాడొద్దని బండికి జవదేకర్ స్పష్టం చేసినట్టు సమాచారం.

# పెత్తందార్లకు, పేదలకు జరిగే యుద్ధంలో పేదలదే గెలుపు - జగన్

అమరావతి, జులై 24: అమరావతి ప్రాంతంలో పేదలకు ఇళ్లు ఉండకూడదనే ఉద్దేశంతో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, దత్తపుత్రుడు, ఎల్లో మీడియా, చంద్రబాబు నేతృత్వంలోని ప్రజా సంఘాలు హైకోర్టు, సుప్రీంకోర్టులోనూ కేసులు వేసి అడ్డంకులు సృష్టించారని . అయినా కోర్టులో గెలిచి వారికి ఇళ్లు కట్టించి ఇస్తున్నామని అన్నారు ముఖ్యమంత్రి జగన్.. నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు పథకం కింద సీఆర్‌డీఏలో 50వేలకు పైగా ఇళ్ల నిర్మాణానికి కృష్ణాయపాలెంలో నేడు ఎం జగన్ భూమి పూజ చేశారు. కృష్ణాయపాలెం లేఅవుట్‌లో పైలాన్‌ను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. అనంతరం వన మహోత్సవంలో భాగంగా ముఖ్యమంత్రి మొక్కలు నాటారు.



ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం జగన్ మాట్లాడుతూ, అమరావతిలో పేదలకు ఇళ్లు రాకూడదని అనేకమంది కుట్రలు చేశారని ఆరోపించారు. ఇల్లు రాకుండా ఉండేందుకు చంద్రబాబు, గజదొంగల ముఠా దాదాపు 23 కేసులు కోర్టుల్లో వేశారని వెల్లడించారు. పెత్తందార్లకు,పేదలకు మధ్య జరుగుతున్న యుద్ధం అని సీఎం అన్నారు. ఈ యుద్ధంలో పేదలు గెలుపొందారన్నారు. నేటి నుంచి ఈ అమరావతి మన అందరి అమరావతి అని చెప్పుకొచ్చారు. అంతేకాదు ఈ శంకుస్థాపనతో కొందరికే పరిమితమైన ఈ అమరావతి ఇకపై సామాజిక అమరాతి అని సీఎం వైఎస్ జగన్ చెప్పుకొచ్చారు.

కాగా, అమరావతి పరిసర ప్రాంతాల్లో 50,793 మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చాం అని జగన్ వెల్లడించారు. ఈ లబ్ధిదారుల అందరికీ ప్రభుత్వమే ఇల్లు నిర్మించి ఇస్తుంది అని స్పష్టం చేశారు. ఈరోజు నుంచి సామాజిక అమరావతిగా రూపుదిద్దుకునేలా అడుగులు వేస్తున్నట్లు సీఎం జగన్ తెలిపారు. 1400ఎకరాలలో 25 లే అవుట్లను అభివృద్ధి చేసి ఇళ్లస్థలాలు ఇల్లు నిర్మించి ఇచ్చే బాధ్యతను తామే తీసుకుంటాం అని ప్రకటించారు. ప్లాట్ల సరిహద్దులను కూడా ప్రభుత్వమే చేస్తుందని తెలిపారు. ఇందుకోసం ఇప్పటికే రూ.50కోట్లు ఖర్చు చేసినట్లు వెల్లడించారు. సీఆర్డీఏ పరిధిలో ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.2.75లక్షలు ఖర్చు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ ఇళ్లకు సంబంధించి రూ.1370 కోట్లు ఖర్చు చేయబోతున్నట్లు సీఎం వైఎస్ జగన్ సభలో ప్రకటించారు.

ఇళ్ల నిర్మాణంలో నీటి సరఫరా కోసం రూ.35 కోట్లు ఖర్చు చేయబోతున్నామని ఇప్పటికే టెండర్లు పూర్తి చేసినట్లు చెప్పుకొచ్చారు. అలాగే విద్యుత్ కనెక్షన్ కోసం రూ.326 కోట్లు..అప్రోచ్ రోడ్ల కోసం రూ.8 కోట్లు ఖర్చు చేయనున్నట్లు ప్రకటించారు. ఈ లే ఔట్లలోనే అంగన్ వాడీ స్కూల్స్, విద్యాసంస్థలు, పార్కులు, షాపింగ్ కాంప్లెక్స్, థియేటర్లు రాబోతున్నాయని చెప్పుకొచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా 30.75లక్షల మంది అక్కచెల్లమ్మలకు పట్టాలు ఇచ్చినట్లు జగన్ వెల్లడించారు. ఒక్కొక్క ఇంటి విలువ రూ.5 నుంచి రూ.15 లక్షల వరకు పలుకుతుంది అని చెప్పుకొచ్చారు. ఈ సీఆర్డీఏ ప్రాంతంలో గజం కనీసం రూ.15వేలు అని? ఇంటి స్థలం విలువే రూ.7.50 లక్షలు అని చెప్పుకొచ్చారు. మరో రూ.2.75 లక్షలు పెట్టి ఇల్లు నిర్మిస్తున్నామని? మౌలిక సదుపాయాల కోసం ఒక్కో ఇంటిపై రూ.లక్ష ఖర్చు చేస్తున్నట్లు చెప్పుకొచ్చారు. ఇల్లు పూర్తి చేసి ఇచ్చేసరికి రూ.12 నుంచి 15 లక్షల వరకు ఇల్లు విలువ పలుకుతుంది అని ఈ విలువను అక్కచెల్లెమ్మలకు ఇస్తున్నట్లు సీఎం జగన్ ప్రకటించారు.

# కృష్ణ చైతన్య ఆధ్వర్యంలో ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు



ఖమ్మం, జులై 24: (నేటినిజం ప్రతినిధి): బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్రయువ నేత కేటీఆర్ పుట్టినరోజు సందర్భంగా ఖమ్మం జిల్లా ప్రభుత్వఆసుపత్రిలో జిల్లాయువజన అధ్యక్షుడు చింతనిప్పు కృష్ణచైతన్య ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించిన ఎమ్మెల్సీ, ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తాతా మధుసూదన్. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పుట్టినరోజు సందర్భంగా సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా అన్నదాన కార్యక్రమాలు నిర్వహించిన జిల్లా యువజన అధ్యక్షుడు చింతనిప్పు కృష్ణచైతన్యని అభినందించిన ఎమ్మెల్సీ, ఖమ్మం జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తాతా మధుసూదన్ మాట్లాడుతూ...యువనేత కేటీఆర్ పుట్టినరోజు సందర్భంగా ఖమ్మం జిల్లా వ్యాప్తంగా సామాజిక సేవా కార్యక్రమాలతో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఘనంగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పుట్టినరోజు వేడుకలు జరుపుకున్నట్లు వారు తెలిపారు. యువజన విభాగం ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం అభినందించదగ్గ విషయమని, యువజన విభాగం ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న యువజన అధ్యక్షుడు కృష్ణచైతన్యని వారు ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు చింతనిప్పు కృష్ణచైతన్య మాట్లాడుతూ...తమ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, యూత్ ఐకాన్ కేటీఆర్ పుట్టినరోజు సందర్భంగా జిల్లా పార్టీ పిలుపుమేరకు జిల్లా వ్యాప్తంగా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ఖమ్మంజిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో వివిధ వైద్య సేవలు పొందెందుకు వచ్చిన 500 నిరుపేదలకు రుచికరమైన భోజనం ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ చేతుల మీదగా ప్రారంభించి, అన్నదానం చేయడం జరిగిందని వారు తెలిపారు. నేడు కేటీఆర్ అంటే తెలంగాణ రాష్ట్రంలోనే కాదు యావత్ దేశంలో ఒక బ్రాండ్ అని యువజన నాయకుడు చింతనిప్పు కృష్ణచైతన్య తెలిపారు. దేశంలోనే ఏ రాష్ట్రంలో లేని విధంగా విదేశాల పెట్టుబడులు ఆకర్షిస్తూ తెలంగాణ గడ్డపై విఖ్యాత చెందిన ప్రముఖ కంపెనీలను ఆకర్షించి, పెట్టుబడులను ప్రోత్సహిస్తూ తెలంగాణ యువతకు భారీ ఉద్యోగ అవకాశాలు కల్పించిన ఘనత యువనేత కేటీఆర్ అని తెలిపారు. పార్టీ ప్రతిష్టతకు వర్కింగ్ ప్రెసిడెంట్ గా దోహదం చేస్తూనే రాష్ట్ర అభివృద్ధికి రాష్ట్ర మున్సిపల్-పరిశ్రమశాఖ మంత్రిగా ప్రత్యేక గుర్తింపు సాధించి తనదైన శైలిలో పనిచేస్తున్న యువ మంత్రిగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మంజిల్లా పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, జిల్లా యువజన అధ్యక్షులు చింతనిప్పు కృష్ణచైతన్య, తెలంగాణ ఉద్యమకారు లు బొమ్మెర రామ్మూర్తి, జడ్పిటిసి వర ప్రసాద్, పార్టీ నాయకులు ముత్యాల వెంకట అప్పారావు, అశ్విన్, చామకూరి రాజు, యువజన విభాగం నాయకులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులను వెంటనే. పరిష్కరించాలి.. అదనపు కలెక్టర్ జి. వెంకటేశ్వర్లు.

మెదక్, 24:(నేటినిజం ప్రతినిధి):మెదక్,ఆర్. డి .ఓ అంబాదాస్ రాజేశ్వర్ తో కలిసి ప్రజావాణి ఫిర్యాదులు స్వీకరించారు ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన అర్జీలను ఆయా శాఖల అధికారులు పరిశీలించి దరఖాస్తుదారుని సమస్య ను ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పరిష్కరించాలని అన్నారు. ఆయా శాఖలలో పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను సంబంధిత శాఖాధికారుల పరిష్కరించే దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని అన్నారు. అర్జిదారులు దూర ప్రాంతాలనుండి వసారని వారి సమస్యల ను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

ఈ రోజు నిర్వహించిన ప్రజావాణిలో 128 దరఖాస్తులు పలు సమస్యలపై రావడం జరిగిందని, ఆయా శాఖల అధికారులు అర్జీలపై చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రజావాణిలోకౌడి పల్లి మండలం, కూకట్ల పల్లి గ్రామానికి చెందిన గొల్ల దుర్గయ్య అనే వికలాంగునికి మూడు చక్రాల సైకిల్ ని అదనపు కలెక్టర్ అందజేశారు ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు

# కాకినాడలో ముజిగల్ అత్యాధునిక మ్యూజిక్ అకాడమీ ప్రారంభం



హైదరాబాద్, జులై 24:భారత దేశపు అతిపెద్ద మ్యూజిక్ ఎడ్యుకేషన్ ప్లాట్‌ఫామ్, ముజిగల్ తమ 7వ అత్యాధునిక సంగీత అకాడమిని కాకినాడ (ఆంధ్రప్రదేశ్) లో ప్రారంభించింది. ఈ కేంద్రాన్ని కాకినాడ పార్లమెంట్ సభ్యులు వంగ గీత, కాకినాడ స్మార్ట్ సిటీ ఎమ్మెల్యే డి చంద్రశేఖర్ రెడ్డి, స రి గ మ తెలుగు సీజన్ 13వ విజేత, గాయకుడు యశస్వి కొండేపూడి, ముజిగల్ ఫౌండర్ డాక్టర్ లక్ష్మీనారాయణ ఏలూరి ప్రారంభించారు. ఈసందర్భంగా ముజిగల్ అకాడమీ ప్రారంభం గురించి ముజిగల్ ఫౌండర్ డాక్టర్ లక్ష్మీనారాయణ ఏలూరి మాట్లాడుతూ సంగీత విద్యను అందరికీ చేరువ చేయాలనే మహోన్నత లక్ష్యంతో ముజిగల్ అకాడమీ తీర్చిదిద్దామన్నారు. అభ్యాసకులకు అత్యాధునిక సౌకర్యాలతో కూడిన కేంద్రాన్ని తమకు దగ్గరలో అందిస్తుందన్నారు. సంగీతంలో అత్యుత్తమ అభ్యాసం, బోధన అనుభవాలను ఈ కేంద్రం అందించనుంది. భారతీయ పాశ్చాత్య సంగీతంలో విస్తృత శ్రేణి కోర్సులను ఇది అందిస్తుందన్నారు.

ఈ కోర్సులను నిష్ణాతులైన సంగీత అధ్యాపకులు బోధించనున్నారన్నారు. వీటితో పాటుగా అభ్యాసకులను లక్ష్యంగా చేసుకుని ఓ నిర్మాణాత్మక కరిక్యులమ్ (బోధనాంశాలు), పీరియాడిక్ ఎస్సెస్‌మెంట్స్, సర్టిఫికేషన్, సౌకర్యవంతమైన ఫీజు చెల్లింపు ప్లాన్స్, సుశిక్షితులైన అధ్యాపకులను అందుబాటులో ఉంచామని అన్నారు. భారతదేశంతో పాటుగా యుఎస్‌ఏ, యుకె, ఆస్ట్రేలియా, యుఏఈలలో 10వేల మంది విద్యార్థులకు 400కు పైగా సుశిక్షితులైన సంగీత టీచర్లు మద్దతు అందిస్తున్నారన్నారు. ఇప్పటికే 40వేల తరగతులు విజయవంతంగా పూర్తయ్యాయన్నారు. సుశిక్షితులైన టీచర్లు, షాప్ ఫ్రంట్ తో చుట్టుపక్కల సంగీత అకాడమీలను సంపూర్ణం చేయడం, పునర్నిర్మించడం చేస్తుందన్నారు. అన్ని వయసులు, వర్గాల అభ్యాసకులను ముజిగల్ ఆహ్వానిస్తోందన్నారు.

# రాజధాని అమరావతి మాస్టర్ ప్లాన్‌లో మార్పులు, చేర్పులు

**-అర్ 5 జోన్ ప్రభుత్వం ఏర్పాటు**

అమరావతి జూలై 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: రాజధాని అమరావతి మాస్టర్ ప్లాన్‌లో మార్పులు, చేర్పులు చేస్తూ అర్ 5 జోన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఆర్ 5 జోన్ ఏర్పాటుపై గతంలో రాజధాని రైతులు హైకోర్టుకు వెళ్లారు. గ్రామ సభల అభిప్రాయాలు తీసుకోవాలంటూ హైకోర్టు ఆదేశించింది. రాజధానిలోని ప్రతి గ్రామం ఏకగ్రీవంగా ఆర్ 5 జోన్‌ను వ్యతిరేకిస్తూ తీర్మానం చేసింది. అయినా కూడా అవేమీ పట్టించుకోకుండా స్పెషల్ ఆఫీసర్ల సాయంతో ప్రభుత్వం అర్ 5 జోన్‌ను ఏర్పాటు చేస్తూ గెజిట్ విడుదల చేసింది. దీంతో ఆర్ 5 జోన్‌లో జగన్ సర్కార్ పనులను ప్రారంభించింది.అర్ 5 జోన్ లో 47 వేల మందికి సెంట భూమిని జగన్ సర్కార్ కేటాయించింది. ఆర్ 5 జోన్ లో సెంటు భూమిని కేటాయించడంపై రైతులు సుప్రీంకోర్టుకు వెళ్లారు. హైకోర్టు తుది తీర్పుకు లోబడి పట్టాలు ఇవ్వాలని సుప్రీంకోర్టు సూచించింది. సెంటు స్థలంలో నిర్మాణాలకు చట్టబద్ధత, న్యాయబద్ధత ఉండవంటూ వెల్లడించింది. అలాంటి స్థలాల్లో ఇల్లు నిర్మించేందుకు కేంద్రం కేటాయించిన 700 కోట్లు రైతుల అభ్యంతరాలతో కేంద్ర గృహ నిర్మాణ శాఖ వెనక్కి తీసుకుంది. కోర్టు తీర్పు ఎలా ఉన్నా తాము ముందుకే వెళతామంటూ ఆ స్థలాల్లో నేడు సీఎం జగన్ భూమి పూజ చేయనున్నారు. కోర్టు తీర్పు వ్యతిరేకంగా వస్తే అక్కడ నిర్మించే నిర్మాణాలకు చేసినా ఖర్చు వృథా అవుతుంది. జగన్ రాకను నిరసిస్తూ నల్ల బేలున్లతో, జండాలతో శిబిరాల్లో ఉదయం నుంచి రైతులు నిరసనలకు దిగుతున్నారు.

# ఘనంగా కేటీఆర్ బర్త్ డే.. లింగేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు



నిజామాబాద్, జులై 24: బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు జన్మదిన వేడుకలు ఆర్టీసీ చైర్మన్ నిజామాబాద్ రూరల్ శాసనసభ్యులు బాజిరెడ్డి గోవర్ధన్ ఆదేశానుసారం నిజామాబాద్ రూరల్ మండలంలో గల గాంధీ నగర్ గ్రామపంచాయతీ పరిధిలో ఐ డి సి ఎం ఎస్ ఉమ్మడి జిల్లాల చైర్మన్ సాంబారి మోహన్, మండల ఎంపీపీ అనుష ప్రేమ్ నాయక్, జడ్పిటిసి సుమలత గోపాల్ రెడ్డి, ఆధ్వర్యంలో లింగేశ్వర ఆశ్రమం కృష్ణ మహారాజ్ చేతుల మీదుగా శివునికి ప్రత్యేక పూజ చేయించి పాలాభిషేకం చేయడం చేశారు.

ఈ సందర్భంగా చైర్మెన్ సాంబార్ మోహన్ మాట్లాడుతూ.. మంత్రి కేటీఆర్ జన్మదినాన్ని మండలాల్లోని ఆలయాల్లో ఘనంగా జరుపుకుంటారని, నాయకులు, కార్యకర్తలు, సర్పంచ్ లు, ఎంపీటీసీ లు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ అన్నం సాయిలు, మండల పార్టీ అధ్యక్షులు మిసాల మధుకర్ రావు, కేసీఆర్ సేవాదళం రూరల్ కన్వీనర్ దేవేందర్, నుడా డైరెక్టర్ సంతోష్, పీఏసీఎస్ చైర్మన్ జితేందర్, మండల సర్పంచ్ ఫోరం అధ్యక్షులు అశోక్, మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు బానోత్ గోపాల్ నాయక్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు మనుబోతుల మల్లేష్ పీఏసీఎస్ మాజీ చైర్మన్ రాయడి బాలరాజ్ కేశపూర్ విజయ్ వివిధ గ్రామాల ఎంపీటీసీ సభ్యులు స్వామి, వివిధ గ్రామాల సర్పంచులు అనూష, నగేష్, రాంగోపాల్ రెడ్డి సుభాష్, శ్రీనివాస్ రెడ్డి, నవీన్, సురేందర్, జలంధర్, ఆయా గ్రామ శాఖ అధ్యక్షులు మారయ్య, ఉప సర్పంచ్ గురువయ్య, సీనియర్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సీఎంఎస్ ఎస్ఐ జి శ్రీనివాస్‌కు సిఐగా పదోన్నతి

## -ఎస్పీ అఖిల్ మహాజన్ శుభాకాంక్షలు



రాజన్న సిరిసిల్ల, జులై 24:(నేటినిజం ప్రతినిధి): రాజన్న సిరిసిల్ల జిల్లాలో సీఎస్ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న జి శ్రీనివాస్ సీఐ జి శ్రీనివాస్ సీఐగా పదోన్నతి పొందారు.

ఈ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ను సీఐ శ్రీనివాన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పదోన్నతి పొందిన సిఐ శ్రీనివాస్ కి జిల్లా ఎస్పీ పదోన్నతి చిహ్నాలు దరింపజేసి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖలో పనిచేస్తూ ఎన్నో ఏళ్ల ప్రజా సంరక్షణ కోసం అవిశ్రాంతంగా పని చేస్తున్న కృషికి పదోన్నతి ఒక గొప్ప గుర్తింపు అన్నారు. పదోన్నతి అనేది ప్రతి ఉద్యోగి జీవితంలో ఒక మైలురాయి వంటిదని, ముఖ్యంగా పోలీస్ శాఖలో మరింత బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించవలసి ఉంటుందని ఎస్పీ అన్నారు.

# ఫైలేరియా వ్యాధి నివారణ కోసం మాస్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ శిక్షణ కార్యక్రమం




ఖమ్మం, జులై 24: (నేటినిజం ప్రతినిధి): ఈ రోజు స్థానిక టీ.టీ.డీ.సి. మీటింగ్ హాల్ నందు ఫైలేరియా వ్యాధి నివారణ కోసం మాస్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ కార్యక్రమంపై వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో గల వైద్యాధికారులకు, సూపర్వైజర్లకు శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లావైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బి.మాలతి హాజరై మాట్లాడుతూ...జిల్లాలో బోదకాలు వ్యాధిని నిర్మూలించి ఫ్రీ ఫైలేరియా జిల్లాగా చేసేందుకు ప్రతి ఒక్కరూ ఈ మాత్రలు మింగించేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనికోసం పగడ్బంది ప్రణాళికను రూపొందించి అమలు చేయాలని చెప్పారు. జోనల్ మలేరియా అధికారి డాక్టర్ సునీల్ కుమార్, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చి మాట్లాడుతూ ఫైలేరియా వ్యాధి సోకే మార్గాలు, వ్యాధి నిర్మూలన కార్యక్రమం ఎలా అమలు చేసే విధానాన్ని వివరించారు. అలాగే ఆగస్టు నెలలో జరిగే కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేయాలని చెప్పారు. అనంతరం వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ కన్సల్టెంట్ డాక్టర్ శిరీష, అడిషనల్ డైరెక్టర్ నాగయ్యలు, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మాస్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ కార్యక్రమం గురించి 2సంవత్సరాల పై బడిన వారందరికీ మాత్రలు మింగించి వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ సైదులు, డాక్టర్ ప్రమీల, డాక్టర్ లక్ష్మీనారాయణ, సీనియర్ ఎంటమలజిస్ట్ వెంకటేశ్వరరావు, డెమో సాంబశివ రెడ్డి, వైద్యాధికారులు, సూపరవైజర్ లు సిబ్బంది ఉన్నారు.

# కొండాపూర్‌లో ఘనంగా మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలు

## -హాట్ బాక్స్‌కు పంపిణీ చేసిన ఏనుగు మనోహర్ రెడ్డి



రాజన్న సిరిసిల్ల, జులై 24:(నేటి నిజం ప్రతినిధి): వేములవాడ నియోజక వర్గంలోని మేడిపెల్లి మండలం కొండాపూర్ గ్రామంలో తెలంగాణ రాష్ట్ర పురపాలక, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి జన్మదినం వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి కేక్ కట్ చేశారు. అనంతరంగిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమంలో భాగంగా ఉపాధి హామీ కూలీలకు హాట్ బాక్సులు పంపిణీ చేశారు. ఈ వేడుకల్లో సర్పంచులు అభిలాష్, సురేష్, బాలరాజ్, నవీన్ రెడ్డి, సురేష్, ఏఎంసీ వైస్ చైర్మన్ లింగారెడ్డి, ఎంపీటీసీలు అంకం వినోద -సాగర్, లావణ్య-రాజేశ్వర్ రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షులు ముక్కెర గంగాధర్, కమలాకర్, సురేందర్, మాధవ్, ప్రశాంత్, సతీష్, నరేష్, ఫయాని, ప్రభాకర్, కాశ శ్రీనివాస్, ముత్త మహేష్, శేఖర్, మహేష్, శ్రీదర్, భగవాన్ తదితరులు ఉన్నారు.

# సంప్రదాయ వైద్యాన్ని భారతదేశ జీ 20 ప్రెసిడెన్సీ ఉపన్యాసంలో ఆయుష్ మంత్రిత్వ శాఖ ముందంజలో ఉంచింది - అమితాబ్ కాంత్

న్యూఢిల్లీ, జులై 24:న్యూఢిల్లీలో జరిగిన జీ20 ఎంగేజ్‌మెంట్ గ్రూపులతో జరిగిన ఒక ముఖ్యమైన పరస్పర చర్యలో, భారతదేశ ప్రభుత్వ ప్రయత్నాలు ఆరోగ్యంపై జీ20 చర్చలో సాంప్రదాయ వైద్యాన్ని ముందంజలో ఉంచాయని మరియు ఆరోగ్య సవాళ్లను పరిష్కరించడంలో సాంప్రదాయ వైద్యం యొక్క సంభావ్య పాత్రను జీ20 గుర్తిస్తుందని వాటాదారులు స్పష్టమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.ఇంటరాక్టివ్ మీట్‌లో శ్రీ అమితాబ్ కాంత్, షెర్పా జీ20, ఆయుష్ మంత్రిత్వ శాఖ కార్యదర్శి వైద్య రాజేష్ కొటేచా, ఎంట హెచ్ ఎఫ్ డబ్ల్యూ ఎంట హెచ్ ఎఫ్ డబ్ల్యూ అదనపు కార్యదర్శి శ్రీ లవ్ అగర్వాల్, ఎం ఈ ఏ అదనపు కార్యదర్శి శ్రీ అభయ్ ఠాకూర్, వివిధ ఎంగేజ్‌మెంట్ గ్రూపుల అధ్యక్షులు మరియు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.శ్రీ అమితాబ్ కాంత్ తన ప్రసంగంలో, "అన్నివర్కింగ్ గ్రూపులతో చురుకుగా సహకరించడంలో ఆయుష్ మంత్రిత్వ శాఖ ముందంజలో ఉన్నందుకు నేను ఎంతో అభినందిస్తున్నాను. సంపూర్ణ ఆరోగ్యం మరియు శ్రేయస్సును సాధించడంలో ఆయుష్ వైద్య విధానాల ప్రాముఖ్యతను మనం విస్తరించాలి.

"సాంప్రదాయ వైద్యం" అనేది చాలా ముఖ్యమైనదని, ఎందుకంటే ఇది భారతదేశంలో శతాబ్దాలుగా ఆరోగ్యానికి ఒక సమగ్ర వనరుగా ఉంది మరియు సంపూర్ణ ఆరోగ్యం మరియు శ్రేయస్సును సాధించడంలో ఆయుష్ పద్ధతులను విస్తరించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ భారతదేశంలో ప్రత్యేకమైన డబ్ల్యూ హెచ్ ఓ గ్లోబల్ సెంటర్ ఫర్ ట్రెడిషనల్ మెడిసిన్ (డబ్ల్యూ హెచ్ ఓ జీ సీ టీ ఎం)తో ముందుకు వచ్చిందని, ఈ కేంద్రం సాంప్రదాయ ఔషధం యొక్క శక్తిని ఉపయోగించుకోనుందని ఆయన హైలైట్ చేశారు.శ్రీ లవ్ అగర్వాల్ తన ప్రసంగంలో, "ప్రపంచం అన్ని ఆరోగ్య సవాళ్లను ఎదుర్కోవడంలో సమగ్ర ఆరోగ్యం లేదా సంపూర్ణ ఆరోగ్యం అనే భావన గురించి మాట్లాడుతోంది. మేము భాగస్వామ్యంతో పని చేస్తున్నాము, జీ20 దేశాల మధ్య సమన్వయంతో పని చేస్తున్నాము మరియు ఆరోగ్య రంగంలో సాంప్ర దాయ ఔషధం పోషిస్తున్న పాత్రను అంగీకరించే విషయంలో అందరికీ స్పష్టమైన అభిప్రాయం ఉంది.

పరస్పర చర్యలో పాల్గొన్న వివిధ నిపుణులు మరియు సీనియర్ అధికారుల అనుభవ భాగస్వామ్యం నుండి, ఆరోగ్య ప్రకటనలో సాంప్రదాయ ఔషధం యొక్క సంభావ్య పాత్రను గుర్తిస్తూ ప్రత్యేక ప్రస్తావన ఉండే బలమైన సంభావ్యత ఉద్భవించింది.ఈ సందర్భంగా, వైద్య రాజేష్ కోటేచా వారి సిఫార్సులు మరియు తెలివైన చర్చల ద్వారా సాంప్రదాయ వైద్య రంగంలో తమ వంతు సహకారం అందించినందుకు వర్కింగ్ గ్రూపుల నాయకత్వాన్ని వ్యక్తిగతంగా అభినందించారు. భారతదేశం యొక్క జీ20 ప్రెసిడెన్సీలో ఆయుష్ మంత్రిత్వ శాఖ యొక్క సహకారాన్ని పంచుకోవ డం ప్రధాన లక్ష్యం అని మరియు అది విజయవంతంగా సాధించబడిందని ఆయన అన్నారు. అన్ని ఆరోగ్య కార్యవర్గ సమావేశాలలో సాంప్రదాయ ఔషధం ప్రభావవంతంగా హైలైట్ చేయబడింది మరియు మంత్రిత్వ శాఖ ఈ ప్రయత్నాలను అభినందిస్తుంది.

సమావేశాన్ని స్వాగతిన్నూ, ఆయుష్ మంత్రిత్వ శాఖ జే ఎస్ శ్రీ రాహుల్ శర్మ, జీ20 యొక్క వివిధ వర్కింగ్ గ్రూపులతో సాంప్రదాయ వైద్యం గురించి చురుకుగా సంభాషణను నిర్మించడంలో ఆయుష్ మంత్రిత్వ శాఖ పాత్రను హైలైట్ చేశారు. జీ20 శిఖరాగ్ర సమావేశానికి ప్రపంచ ప్రధాన ఆర్థిక వ్యవస్థల నాయకులు సమావేశమవుతున్నందున, ప్రపంచ సామాజిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సాంప్రదాయ వైద్యం కీలక పాత్ర పోషిస్తుందని మరియు వైద్య పరిజ్ఞానాన్ని పెంపొందించడంలో మరియు కొత్త చికిత్సలను అభివృద్ధి చేయడంలో దోహదపడుతుందని ఆలోచించడం అత్యవసరం.సీ ఎస్ ఐ ఆర్ -ఐ జీ ఐ బీ సీనియర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ భావనా ప్రాషెర్ థింక్20, సైన్స్20, స్టార్టప్20, సివిల్20, విమెన్20, యూత్20 మరియు అగ్రికల్చర్20 వంటి జీ20 ఎంగేజ్‌మెంట్ గ్రూపులతో ఆయుష్ ఎంగేజ్‌మెంట్ ను హైలైట్ చేశారు. భారతదేశం యొక్క జీ20 ప్రెసిడెన్సీ పరిధిలో పనిచేస్తున్న సంబంధిత ఎంగేజ్‌మెంట్ గ్రూపుల చైర్, భారతదేశాన్ని ప్రపంచ సాంప్రదాయ ఔషధ చోదక శక్తి గా ప్రదర్శించడానికి జీ20 ప్లాట్‌ఫారంను ఉపయోగించుకునే సమన్వయ ప్రయత్నాల గురించి మరియు ఈ దృష్టిని సాధించడానికి సిఫార్సు గురించి మాట్లాడారు.

# మంత్రి కేటీఆర్ బర్త్ డే సందర్భంగా మొక్కలు నాటిన దాసోజు శ్రవణ్



హైదరాబాద్, జులై 24:రాష్ట్ర మున్సిపల్, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ పుట్టిన రోజును పురస్కరించుకుని సోమవారం తెలంగాణ భవన్ లో బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ కేక్ కట్ చేసి, రక్త దాన శిబిరం ప్రారంభించడం జరిగింది. అనంతరం కేటీఆర్ కు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలుపుతూ.. మొక్క నాటారు. ఈ కార్యక్రమంలో మంత్రి శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్యే బాల్క సుమన్, కార్పొరేషన్ ఛైర్మెన్లు, కట్టెల శ్రీనివాస్ యాదవ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రవణ్ మాట్లాడుతూ.. గల్లీ నుంచి ఢిల్లీ వరకు నేడు కేటీఆర్ పేరు మారుమోగుతుందన్నారు. కేటీఆర్ రాజకీయ చతురత, మాటలతో ఓటర్లను ఆకట్టుకునే వాగ్దాటి, వ్యూహాల్లో తండ్రికి తగ్గ తనయుడు, యువతరానికి స్ఫూర్తి, వేదిక ఏదైనా ఆంగ్లంలో అనర్గలంగా మాట్లాడి ప్రపంచాన్ని మైమరపింపజేసే ఘనుడు అంటూ చెప్పుకొచ్చారు. గెలుపునకు షార్ట్ కట్స్ ఉండవు అని నమ్మి.. లక్షసాధనగా అడుగుల్లో వేగం పెంచుతూ ప్రజలకు చేరువగా ఉంటుంది లీడర్ కేటీఆర్ అని అన్నారు.

తెలంగాణ రాజకీయాల్లో మంత్రి కేటీఆర్‌ది ఓ ప్రత్యేక స్థానం అని చెప్పాలిన పనిలేదన్నారు. మలిదశ ఉద్యమం నుంచి పుట్టుకొచ్చిన అసలు సిసలు తెలంగాణ వాది కేటీఆర్ అన్నారు. లోకల్ టు గ్లోబల్ ఏ విషయమైనా వేగంగా స్పందించే గుణం ఆయనదన్నారు. అందుకే ఆయన్ను అందరూ రామన్న అని పిలుస్తుంటారన్నారు. తండ్రి సీఎం కేసీఆర్‌కి తగ్గ తనయుడిగా నేటి రాజకీయాల్లో తనదైన ముద్ర వేస్తూ యాంగ్ అండ్ డైనమిక్ లీడర్ అని వరల్డ్ వైడ్ గా కేటీఆర్ ను పిలుచుకుంటున్నారనీ శ్రవణ్ పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొనేందుకు అమెరికాలో చేస్తున్న ఉద్యోగాన్ని వదిలి 2004 నుంచి పరోక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టారన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో తండ్రి కేసీఆర్ అడుగుజాడల్లో నడుస్తూ మడమతిప్పని పోరాటం చేశారన్నారు. 2009లో మొదటిసారి సిరిసిల్ల నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారన్నారు. ఆ తర్వాత తెలంగాణ కోసం తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసేందుకు వెనుకాడలేదన్నారు. తిరిగి 2010 ఉప ఎన్నికల్లో అదే నియోజకవర్గం నుంచి భారీ మెజార్టీతో గెలుపొందారన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం వచ్చాక 2014 నుంచి ఐటీ, మున్సిపల్, పరిశ్రమల శాఖ మంత్రిగా తనదైన శైలిలో బాధ్యతలు నిర్వర్తిస్తున్నారన్నారు.

2018లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు చేపట్టి పార్టీని ప్రజలకు చేరువ చేయడంతోపాటు నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ముందుకుసాగుతున్నారన్నారు. కేటీఆర్ ఆలోచనలు ఎప్పుడూ వినూత్నంగానే ఉంటాయన్నారు. సామాజిక సమస్యలను అర్థం చేసుకోవడంతోపాటు వాటికి తగిన పరిష్కార మార్గాలను అన్వేషిస్తుంటారన్నారు. మంత్రి కేటీఆర్ ఆలోచనలతో పురుడుపోసుకున్న ఆవిష్కరణలు ఎన్నో. అందుకు హైదరాబాద్‌లో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్‌లో డాక్టర్ సైరస్ పూనావాలా ఇన్ఫెక్షియస్ డిసీజెస్ అండ్ పాండమిక్ ప్రిపేర్డ్‌నెస్ సెంటర్ నిదర్శనమన్నారు. అంతే కాదు మిషన్ భగీరథ పథకాన్ని సీఎం కేసీఆర్ రూపొందించగా, దానిని విజయవంతంగా అమలు చేయడంలో కేటీఆర్ కీలకభూమిక పోషించారన్నారు. వరదల నివారణకు చేపట్టిన స్ట్రాటజిక్ నాలా డెవలప్‌మెంట్, ట్రాఫిక్ నివారణకు చేపట్టిన స్ట్రాటజిక్ రోడ్ డెవలప్‌మెంట్, నగరవాసుల కోసం ఓపెన్ జిమ్‌లు, అర్బన్ పార్కులు ఇలా ఎన్నో విప్లవాత్మక మార్పులకు కేటీఆర్ శ్రీకారం చుట్టినట్లు శ్రవణ్ పేర్కొన్నారు. మరోసారి కేటీఆర్ కు 47వ పుట్టిన రోజు శుభాకాంక్షలను తెలుపుతూ భవిష్యత్ లో ఇంకా ఎంతో ఎత్తుకు కేటీఆర్ ఎదగాలని శ్రవణ్ కోరారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాల్సిందే - డికె అరుణ



మహబూబ్‌నగర్, జులై 24:అర్హులైన ప్రతి ఒక్కరికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలని డిమాండ్ తో బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ ఆధ్వర్యంలో గద్వాల జిల్లా కేంద్రంలో వైఎస్సార్ చౌక్ వద్ద సోమవారం ధర్నా కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీకే అరుణ మాట్లాడుతూ..అర్హులైన ప్రతి ఒక్కరికి రాష్ట్ర వ్యాప్తంగా డబుల్ బెడ్ ఇళ్ళు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నేను మంత్రిగా ఉన్నప్పుడు పేద ప్రజలకు ఇచ్చిన ఇండ్ల పట్టాలను బీఆర్ఎస్ ప్రభుత్వం లాక్కొని ఇంతవరకు ఇవ్వలేదని వీలైనంత త్వరలోపేద ప్రజల ఇండ్ల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ రెండు సార్లు అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రములో పేద ప్రజలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళు, ఖాళీ స్థలం ఉన్న వారికి ఇంటి నిర్మాణం కోసం 5లక్షల రూపాయలు ఇస్తామని ఇవ్వలేదని అన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ పేదరికాన్ని, పేద ప్రజల అవసరాల ను అడ్డుపెట్టుకొని మోసం చేస్తున్నారని విమర్శించారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కేటాయింపు లో డీప్ లు వేసి కొన్ని చోట్ల బీఆర్ఎస్ కార్యకర్తలకే డబల్ బెడ్ రూం ఇళ్ళు మంజూరు చేశారని ఆరోపించారు. పేద ప్రజలకు మోసం చేస్తూ బాధ్యతంగా అమలు చేయవలసిన హామీలను తుంగలోతొక్కి మోసం చేస్తున్నారని విమర్శించారు. అదేవిధంగా నాసిరకంగా డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళు నిర్మాణం చేస్తున్నారని, కొన్ని చోట్ల డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళు పరిశీలించానని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేతకాని ప్రభుత్వం గా నిరూపించుకుందని విమర్శించారు. తెలంగాణ ప్రజలు ఆకాంక్షల ను అణిచివేస్తున్నారని మండిపడ్డారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు కేసీఆర్ కి బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో డీకే అరుణతో పాటు బిజెపి నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, రామచంద్రారెడ్డి, రామాంజనేయులు, బండల వెంకట్ రాములు, బంగి లక్ష్మణ్, బీజేవైఎం నాయకులు మిర్జాపురం వెంకటేశ్వర్ రెడ్డి, పెద్దపల్లి రాజశేఖర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ లు బండల పద్మావతి, టపాలా కృష్ణవేణి రామాంజనేయులు, కౌన్సిలర్లు కబీర్దాస్ అనిత, రజక జయ శ్రీ నరసింహులు, శ్రీనివాస గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థి ఉన్నత భవితకు మార్గదర్శి బీయస్ రావు..

## -ఘనంగా శ్రీ చైతన్య విద్యా సంస్థల చైర్మన్ బీయస్ రావు సంస్మరణ సభ



కరీంనగర్, జులై 24: (నేటినిజం ప్రతినిధి): కరీంనగర్ పట్టణంలోని రంగినేని ట్రస్ట్ హాల్ లో శ్రీ చైతన్య సంస్థల కరీంనగర్ జోనల్ ఆధ్వర్యంలో ఆదివారం శ్రీ చైతన్య విద్యా సంస్థల వ్యవస్థాపకుడు, చైర్మన్ బీఎస్ రావు సంస్మరణ సభను ఘనంగా నిర్వహించారు. దాదాపు 2000 మంది అధ్యాపకులు, సిబ్బంది, బిఎస్ రావుచిత్ర పటానికి పూలమాలలు వేసి, ఘన నివాలర్పించారు. అనంతరం శ్రద్ధాంజలి ఘటించారు. సంస్మరణ సభ కు ముఖ్య అతిథిగా ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు యాదగిరి శేఖర్ రావు, పారమిత విద్యాసంస్థల చైర్మన్ ప్రసాద్ రావు, శ్రీ చైతన్య విద్యాసంస్థల డిజిఎం లక్ష్మణరావు, ఏజీఎం సదాశివరెడ్డి, ఆర్ ఐ రాజు పాల్గొని జ్యోతి ప్రజలను చేసి సంస్మరణ సభను ప్రారంభించారు. ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు యాదగిరి శేఖర్ రావు మాట్లాడుతూ బీఎస్ రావు మృతి విద్యా రంగానికి తీరని లోటని అన్నారు. అతడి ప్రస్థానం ప్రాణదాతగా మొదలై విద్యాదాతగా అవతరించిందని గుర్తు చేశారు. వేలాది కుటుంబాలకు జీవితాన్ని ప్రసాదించారని, శ్రీ చైతన్య విద్యా సంస్థ స్థాపించి ఎంతో మంది విద్యార్థులకు చదువు, విజ్ఞానం, నైపుణ్యాలు అందించిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. డీజీఎం లక్ష్మణరావు మాట్లాడుతూ భారత విద్యారంగంలో బిఎస్ రావు మకుటం లేని మహారాజు అని తమ క్రమశిక్షణ అంకుఠిత దీక్షతో ఎల్లలు లేని శ్రీ చైతన్య విద్యా సామ్రాజ్యాన్ని నిర్మించారని కొనియాడారు. పారామిత విద్యాసంస్థల చైర్మన్ ప్రసాద్ రావు మాట్లాడుతూ అనుభవజ్ఞులైన, నైపుణ్యం కలిగిన అధ్యాపకులను ప్రవేశపెట్టి విద్యార్థులను భవితను ఉన్నతంగా తీర్చిదిద్దారని గుర్తు చేశారు.మెరుగైన విద్యను శ్రీ చైతన్య విద్యాసంస్థల్లో ప్రవేశ పెట్టి కోట్లాది ప్రజల హృదయాల్లో స్థానం పొందిన మహోన్నత వ్యక్తి అని అభివర్ణించారు. ఆర్ఐ రాజు మాట్లాడుతూబీఎస్ రావు ఆశయ సాధన కోసం అనుక్షణం శ్రమిస్తామని, ప్రతి విద్యార్థినీ ఉన్నతంగా తీర్చిదిద్దుతామని,

ప్రతి విజయాన్ని ఆయన స్ఫూర్తితో నింపుతామన్నారు. ఆయన స్థాపించిన శ్రీ చైతన్య సంస్థలో పనిచేస్తున్న అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులకు బీఎస్ రావు

దైవంతో సమానమని అభివర్ణించారు. ఇలాంటి గొప్ప వ్యక్తి జీవితమే తమకు ఆదర్శమని, ఆయన ఆశయ సాధనకు ఎల్లవేళలా కృషి చేస్తామనిచాటి చెప్పారు. బీఎస్ రావు పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులుప్రార్థించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్, సిద్దిపేట్ జోనల్ ప్రిన్సిపాల్ లు ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

# తెలంగాణలో బీఆర్ఎస్‌ను తరిమేయాలి..మహేష్

నిజామాబాద్, జులై 24: తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీని తరిమేయాలని టీపీసీసీ అధికార ప్రతినిధి డాక్టర్ మహేష్ పిలుపునిచ్చారు. డబుల్ బెడ్ రూమ్ ల పరిశీలనకు వెళితే అరెస్టు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.. సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిజామాబాద్ నగరంలోని నూతన కలెక్టర్ కార్యాలయం వద్ద ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పరిశీలన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి టీపీసీసీ అధికార ప్రతినిధి డాక్టర్ మహేష్ హాజరై మాట్లాడారు. నిజామాబాద్ నగరంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. అనంతరం డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పరిశీలనకు వెళుతుంటే కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద పోలీసులు అరెస్టు చేశారు.

ఈ సందర్భంగా కొంత స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. బీఆర్ఎస్ కు వ్యతిరేకంగా కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కాంగ్రెస్ నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి టౌన్ కు తరలించారు. ఈ సందర్భంగా టీపీసీసీ అధికార ప్రతినిధి డాక్టర్ మహేష్ మాట్లాడుతూ.. నిరుపేద ప్రజలకు కనీస అవసరమైన డబుల్ బెడ్ రూమ్ ఇవ్వడంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. నిజాంబాద్ జిల్లాలో ఇప్పటివరకు డబుల్ బెడ్ రూములు ప్రజలకు ఎందుకు ఇవ్వలేదో చెప్పాలని ప్రశ్నించారు.

కాంగ్రెస్ హయాంలో నిరుపేద ప్రజలకు ఇందిరమ్మ ఇల్లు, రాజీవ్ గృహకల్ప ఇచ్చామని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువస్తే నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇస్తామని తెలిపారు. రాబోయే రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీకి ప్రజలే గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గడుగు గంగాధర్, తహేర్ బిన్ అందాన్ కేశవేణు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

